క్లుప్తంగా

బోనమెత్తి..నృత్యం చేసి



నెత్తిన బోనంతో నృత్యం చేస్తున్న హిజ్రా

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో ముదిరాజ్‌లు, పెద్దమ్మ బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లల్లో బోనాలు వండుకుని నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లారు. బోనాలను అమ్మవారికి సమర్పించారు. ఊరేగింపులో హిజ్రాలు నెత్తిన బోనాలు ఎత్తుకుని చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముదిరాజ్ సంఘం జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

శ్రీరాంపూర్/నస్పూర్: తెలంగాణ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని నస్పూర్‌లో ఏర్పాటు చేయాలని రజక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం నాయకులు శ్రీరాంపూర్‌లో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షులు తంగళ్లపల్లి బాబు, మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి పుట్టపాక తిరుపతి, నాయకులు సారయ్య, రాజయ్య, రమేశ్, తిరుపతి, బాబు, మల్లేశ్ పాల్గొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న డ్రైవర్లు

రామకృష్ణాపూర్: సింగరేణిలో అద్దె వాహనాలు నడుపుతున్న కన్వేయన్స్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆర్కేఓసీ డ్రైవర్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందించారు. డ్రైవర్లకు పని భద్రత కల్పించడంతోపాటు పూర్తిస్థాయి కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బిల్లుతో సంబంధం లేకుండా ప్రతీ నెల 10వ తేదీ లోపు వేతనాలు ఇచ్చేలా చూడాలన్నారు. నెలలో నాలుగు రోజులు వేతనంతో కూడిన సెలువులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

గుడ్డ సంచుల పంపిణీ



తాళ్లపెల్లిలో గుడ్డ సంచులు అందజేస్తున్న ఓసీపీ మేనేజర్

శ్రీరాంపూర్: స్వచ్ఛత పక్వాడలో భాగంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ అధికారులు, ఉద్యోగులు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఓసీపీ ముంపు గ్రామమైన తాళ్లపల్లి గ్రామంలో ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కుల వార్‌తో వాటిని అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు బిస్కెట్లు అందించారు. అంతకు ముందు ఓసీపీ వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. గని పర్యావరణ అధికారి జలాలుద్దీన్, సంక్షేమ అధికారి బొంగుని శంకర్, సీనియర్ అండర్ మేనేజర్ వెంకన్న, మైనింగ్ సర్దార్ రాజేశ్వర్, పిట్ సెక్రెటరీ బొంగోని శంకర్ పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ

చెన్నూర్: పట్టణంలోని ఎస్సీవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిఫాంలను 4వ వార్డు కౌన్సిలర్ రెవెల్లి మహేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడిలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్య, భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తోందన్నారు. హెచ్ఎం, బీఆర్ఎస్ నాయకుడు పాశం ఆశిష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

శ్రీరాంపూర్: స్వచ్ఛత పక్వాడాలో భాగంగా శనివారం సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ, సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- నస్పూర్, మంద్రమర్రి మున్సిపాలిటీల్లో దుస్థితి
- పూర్తిస్థాయిలో నియమించని సిబ్బంది
- డిప్యూటేషన్‌పై వెళ్లిన కొందరు
- ఉన్న సిబ్బందితోనే పని



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం

నస్పూర్/మందమర్రిరూరల్: నస్పూర్, మందమర్రి మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తిస్థాయిలో సరిపడా సిబ్బంది నియమించడం లేదు. కొందరు వివిధ కారణాలరీత్యా డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఖాళీ పోస్టులున్నా ఎవరిని నియమించకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఉన్న సిబ్బందితోనే పని చేయిస్తుందని తెలుస్తోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో నస్పూర్, మందమర్రిల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. జరుగుతున్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేక పట్టణాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. చెత్త సేకరణలో జాప్యంతో కాలనీల్లో తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

నస్పూర్ మున్సిపల్ ఏర్పడి ఐదేళ్లు

సింగాపూర్, నస్పూర్, తాళ్లపల్లి, తీగల్‌పహాడ్ గ్రామ పంచాయతీల కలిసి 2018 ఆగస్టు 2న నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పడి ఐదేళ్లు కావస్తోంది. మొత్తం 25 వార్డులు ఉన్నాయి. పట్టణ జనాభా సుమారు 90 వేలకు పైగా ఉంది. మున్సిపాలిటీ జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉండడం, సింగరేణి పారిశ్రామిక కేంద్రం కావడంతో పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. జనాభాకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేరని, దీంతో పలు అభివృద్ధి పనుల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగుల ఉండగా మరికొన్ని విభాగాల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు.

కీలక విభాగాల్లో డిప్యుటేషన్ ఉద్యోగులే..

నస్పూర్‌లో కీలక విభాగాల్లో టౌన్ ప్లానింగ్, అకౌంటెంట్, ఇంజినీరింగ్ ఏఈలు డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. అకౌంటెంట్..వారంలో రెండు రోజులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ ఏఈ మంచిర్యాలతోపాటు అదనంగా నస్పూర్ మున్సిపాలిటీ పనులను పర్యవేక్షిస్తుంటాడు. గతంలో మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల పర్యవేక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉండేవారు. అతని కాంట్రాక్ట్ ముగియడడంతో ఇన్‌చార్జితో పనులు పర్యవేక్షిస్తున్నారు. మున్సిపాలిటీలో మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండగా రెవెన్యూ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతకొన్ని రోజుల క్రితం జూనియర్ అసిస్టెంట్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన పోస్టు ఖాళీగా ఉంది.

మందమర్రిలో..

మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, మేనేజర్, డీఈ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంజినీర్, టీపీవోలు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లకు గాను నలుగురిని కేటాయించగా, ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. 7గురు జూనియర్ అసిస్టెంట్లకు ఆరుగురిని కేటాయిస్తే నలుగురు డిప్యూటేషన్‌పై వెళ్లారు. 20 మంది వార్డు ఆఫీసర్లకు ముగ్గురు ఉన్నారు. మొత్తం 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నలుగురు బిల్ కలెక్టర్లకు ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లగా ఇద్దరు ఉన్నారు. ఒక్క ఏఈ ఉండగా ఆయన మూడు రోజులు మందమర్రిలో, మూడు రోజులు క్యాతన్‌పల్లిలో పని చేస్తున్నారు. ఇద్దరు టీపీఎస్‌లకు గాను ఒక్కరిని కేటాయించారు. ఈయన రెండు రోజులే మందమర్రిలో, మిగిలిన నాలుగు రోజులు లక్సెట్టిపేట, క్యాతనపల్లి మున్సిపాలిటీలను చూసుకుంటారు. టీపీవో, నలుగురు టీపీబీవోలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 13 మంది పబ్లిక్ హెల్త్‌వర్కర్స్ కావల్సి ఉండగా ఐదుగురే ఉన్నారు. 5 మంది శానిటేషన్ జవాన్లకు ఒక్కరు కూడా లేరు. ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లకు ఒక్కరే ఉన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్యూటేషన్‌పై వచ్చారు. ఒక్కరు రావల్సి ఉంది. జేఏవో, ఆర్ఐ ఒక్కో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి

నస్పూర్ మున్సిపాలిటీలో సిబ్బంది కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి స్థానంలో పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని కోరాం.
– రమేశ్, కమిషనర్, నస్పూర్

నివేదించాం

మందమర్రిలో సిబ్బంది కొరతపై కలెక్టర్‌కు నివేదించాం. ఉన్న సిబ్బందితోనే పని నెట్టుకొస్తున్నాం. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలరాగానే సిబ్బంది నియామకం ఉంటుంది.
– గద్దె రాజు, మున్సిపల్ కమిషనర్, మందమర్రి

బడిలో బురద



బురదలో నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు



బురదగా మారిన పాఠశాల ప్రాంగణం

- చెన్నూర్ జెడ్పీ పాఠశాల ప్రాంగణం
- తరగతి గదికి వెళ్తుండగా జారిపడుతున్న విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్‌లో జెడ్పీ బాల,బాలికల పాఠశాలకు మంచి పేరుంది. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఎందరో విద్యార్థులు అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఒక పక్క వాష్‌రూమ్స్ కూలిపోయి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు వాష్‌రూమ్ నిర్మాణం చేపట్టలేదు. మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాల ఎంపికైన నేటికి పనులు కాకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ప్రాంగణం బురదమయంగా మారడంతో తరగతి గదులకు వెళ్లే విద్యార్థులు బురదలో జారి పడుతున్నారు.

వర్షాలకు బురద

చెన్నూర్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మన ఊరు మనబడిలో ఎంపికైంది. పాఠశాల తరగతి గదుల పునఃనిర్మాణంలో భాగంగా సదరు కాంట్రాక్టర్ పునాదుల నుంచి తీసిన మట్టిని పాఠశాల ఎదుట వేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి బురదగా మారింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే మోకాలు లోతు బురదలో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మట్టిని తొలగించి బురదగా మారిన పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని, అలాగే వాష్‌రూమ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి..

వాష్‌రూమ్‌ల నిర్మాణానికి నిధులు వచ్చాయి. పనులు ప్రారంభం కాలేదు. మన ఊరు–మన బడిలో పాఠశాల పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఫిల్లర్ల కోసం తవ్విన మట్టిని తరగతి గదుల వద్ద వేశారు. వర్షాలకు బురదగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నాం. ఈ విషయాన్ని ఎంఈవో, డీఈవోల దృష్టికి తీసుకెళ్లాం. సోమవారం వరకు బురద లేకుండా చర్యలు చేపడుతాం. – లీలారాణి, హెచ్ఎం

రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: ఆస్నాద్ క్లస్టర్ పరిధిలో గల రైతు వేదికలో ఏఈవో సాగర్ శనివారం రైతులకు పచ్చిరొట్ట, పామ్ ఆయిల్ పంటలపై అవగాహన కల్పించారు. వానకాలంలో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈవో

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్‌లు

చెన్నూర్: ముదిరాజ్‌లను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసి, శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని ముదిరాజ్ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలని ఎస్సై చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు నెన్నల సమ్మయ్య, నాయిని మదునయ్య, పాతర్ల నాగరాజు, జోడు శంకర్, తుమ్మ రమేశ్, చింతల శ్రీనివాస్, పిట్టల రాము, రవి, గండు రాజ్, సుంకరి సంతోశ్, నాయిని సతీశ్, అట్టెం రాజబాపు, మద్ద మధు, బాలయ్య పాల్గొన్నారు.

నస్పూర్‌లో..

నస్పూర్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌశిక్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు ఏదునూరి రమేశ్, బింగి సుధాకర్, గోళ్ల సత్యనారాయణ, మంచర్ల సదానందం, తోకల వెంకటస్వామి, ఎనగందుల వెంకటేశ్, రాజు, సూరి, సాగర్, రాయమల్లు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి: వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దండేపల్లి, తాళ్లపేట పీహెచ్‌సీల వైద్యులు సతీశ్, క్రాంతికుమార్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల హెచ్ఎంలతో శనివారం సమావేశం నిర్వహించారు. సికిల్‌సెల్, ఎనీమియా వ్యాధుల గురించి వైద్యులు వివరించారు. పిల్లలు శుద్ధజలాన్ని తాగమని చెప్పాలన్నారు. అనారోగ్యానికి గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీలైతే పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఎంఈవో రవీందర్, నోడల్ అధికారి సత్యనారాయణ, హెచ్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

పొంగిన వాగులు

భీమారం: రుతుపవనాల ఆగమనంతో మండలంలో శనివారం కురిసిన వర్షంతో వాగులు పొంగాయి. భీమారం సమీపంలోని అడవిగుండా వెళ్లే వాగులు వరదనీటితో పొంగి ప్రవహించాయి. మరోవైపు రైతులు పత్తి విత్తనాలను కూలీలతో నాటించే పనులు ముమ్మరం చేశారు.



భీమారం అడవిలో పొంగిప్రవహిస్తున్న వాగు

‘బీఆర్ఎస్ ప్రభుత్వానిది అసత్య ప్రచారం’

బెల్లంపల్లి: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అసత్య ప్రచారం సాగించిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ విమర్శించారు. పట్టణంలోని 26 వార్డులో శనివారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు రాజశేఖర్, కనకం విజయ్, సతీశ్, రాజలింగు, రాజనర్సు, ఎరుకల శ్రీనివాస్, ఆకుల శంకర్, కమల పాల్గొన్నారు.

సుర్జాపూర్‌లో గడప గడపకూ బీజేపీ

భీమిని: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కన్నెపల్లి మండలం సుర్జాపూర్‌లో శనివారం గడప గడపకూ బీజేపీ యాత్ర కొనసాగింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ ఇంటింటికి వెళ్లి ప్రధాని మోదీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి అన్నారపు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు శ్రవణ్, నర్సింగ్, స్వామి, అంజన్న, సాయిచరణ్, రామయ్య, బాపు, లింగమూర్తి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో కరపత్రాలు అందిస్తున్న బీజేపీ నాయకులు

ఏకధాటిగా కురిసిన వర్షం

బెల్లంపల్లిరూరల్/భీమిని: బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల్లో శనివారం ఏకధాటిగా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు. ఇప్పటికే పలువురు రైతులు పత్తి విత్తనాలు నాటారు. ప్రస్తుతం వాన కురవడంతో విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



దాంపూర్‌లో విత్తనాలు విత్తుతున్న రైతులు

టెన్త్ టాపర్లకు సన్మానం

దండేపల్లి: పది ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీనిధి, అమూల్య, స్నేహను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ శనివారం సన్మానించారు. ఇదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బానవత్ ప్రకాశ్ తన కూతురు శ్రీనిధిని ఇదే పాఠశాలలో చదివి 9.3 గ్రేడ్ పాయింట్లు సాధించడంతో, ఉపాధ్యాయుడిని సత్కరించారు. ఎంఈవో రవీందర్, నోడల్ అధికారి సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

గేటు వేస్తే.. దూకుడే



శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ప్రధాన గేట్‌ను శనివారం మూసివేశారు. ఇందులో ఆడుకోవడానికి వచ్చే పిల్లలు, వాకింగ్ కోసం వచ్చే పెద్దలు ఇలా గ్రిల్స్ దూకి లోపలికి వెళ్లాల్సి వస్తోంది. తరచూ ఇలా గేటు వేస్తున్నారని, ఇక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసి నిర్వహణ చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

రోడ్డు మరమ్మతు చేపట్టాలి




భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలో భీమారం సమీపంలోని కేజీబీవీ వద్ద బీటీ రోడ్డు గుంతలుగా మారింది. దాదాపు కిలోమీటరు పొడవు రోడ్డు అధ్వానంగా ఉంది. రెండు వరుసల రహదారిలో గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకుని గుంతలు పూడ్చి, రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– అధికారి: అన్నయ్య, డీఈ నేషనల్ హైవేస్, మంచిర్యాల సెల్: 73826 25560

ఇళ్లలోకి కొండచిలువ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అరుణక్కనగర్‌లో నివాసాల మధ్య శనివారం కొండచిలువ వచ్చింది. భోగి అంజయ్య ఇంట్లోకి రావడంతో గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కొండచిలువను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దూరప్రాంతాల్లోని అడవుల్లో వదిలివేశారు. కాలనీ పక్కనే ప్లాంటేషన్ ఉండడంతో కొండచిలువ ఇక్కడి నుంచి వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.



ఇళ్లలోకి వచ్చినకొండ చిలువ

సంక్షిప్తంగా..

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

చెన్నూర్‌రూరల్: ఆస్నాద్ గ్రామంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం గ్రామానికి వచ్చిన ఆర్అండ్‌బీ ఈఈ పెద్దయ్యను కలిసి విన్నవించారు. గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించి దాని ద్వారా ఇళ్లలోని మురుగునీరు చెరువులోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు గ్రామస్తులు ఉన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కోటపల్లి: నాలుగో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మండలంలోని బామన్‌పల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుడు బుచ్చన్న ఆధ్వర్యంలో వేసవిలో సేకరించిన మామిడి పిక్కలు, కందులు, తీగజాతి విత్తనాలను శెట్‌పల్లి అటవీ ప్రాంతంలో నాటారు. మూగజీవుల ఆహారం కొరత తీర్చడం కోసం వీటిని నాటినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఏ సమయంలో విత్తనాలు నాటాలి, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. బీట్ ఆఫీసర్ అశోక్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మందమర్రిరూరల్: పట్టణంలోని జాతీయ రహదారి టోల్‌ప్లాజా ఆవరణలో ఆదానీ ఫౌండేషన్ చైర్మన్ గౌతమ్ అదానీ పుట్టిన రోజు సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది యువకులు, సిబ్బంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్ర ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పుట్‌బాల్ పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్స్‌లో శనివారం పుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. మందమర్రి పుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మందమర్రి, సోమగూడెం, బెల్లంపల్లి, మంచిర్యాల, రామకృష్ణాపూర్ జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు ఉత్సాహంగా ఆడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలో టౌన్–2 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రాజశేఖర్, ఏఈ జాన్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలోని గౌతమినగర్, ఇస్లామ్‌పూర, హనుమాన్‌నగర్, రాళ్లపేట ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

నస్పూర్: మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యురాలు గబ్బెట్ల జ్యోతి మనువరాలు శ్రీక్షిత జన్మదినం సందర్భంగా నస్పూర్‌లోని శ్రీసాయి దృష్టి అంధుల ఆశ్రమ పాఠశాలలో రూ.5 వేలు విలువ నిత్యావసర సరుకులను(గిన్నెలు) శనివారం అందజేశారు. శ్రీదేవిగౌడ్, పద్మారెడ్డి, జ్యోత్స్న, అమృతమ్మ, ప్రత్యూష, కార్తీక్ పాల్గొన్నారు.